క్లుప్తంగా

అబ్దుల్లాపూర్‌మెట్‌కు చేరిన మాదిగ సంగ్రామ యాత్ర

అబ్దుల్లాపూర్‌మెట్: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 6న యాచారం మండలం మాల్ గ్రామంలో ప్రారంభమైన మాదిగల సంగ్రామ యాత్ర సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మల్లెల నరేష్ ఆధ్వర్యంలో మండలంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి మండలంలో యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నర్సింహా, రాష్ట్ర అధికార ప్రతినిధి మహేష్, నాయకులు ఉమేష్, ప్రశాంత్, కార్తీక్, భాను, నాయకులు పాల్గొన్నారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.6.67లక్షలు

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయా దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ సమక్షంలో దేవాదాయశాఖ అధికారులు సోమవారం లెక్కించారు. మొత్తం 40 రోజులకు గాను భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా.. రూ.6,67,231 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలీ, నాయకులు, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ముఖ్య అర్చకులు యాదగిరిస్వామి, భోడియానాయక్, చంద్రయ్య, దేవేందర్, కృష్ణ, రాములు, రమాదేవి, శ్రీనివాసులు, మహేశ్, పత్యా, హర్షవర్ధన్, కృష్ణయ్య, బాలబ్రహ్మాచారి, శ్రీను, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గ్రామ పంచాయతీలకు ఉత్తమ జాతీయ గ్రామ పంచాయతీ అవార్డులను, ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం మొదలు పెట్టే ముందు అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులను అందజేయడంతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులను ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ చైర్మన్ చంద్రయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

తలకొండపల్లి: క్రీడలు దేహధారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్నిస్తాయని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి విశ్వవిజేత స్కూల్ విద్యార్థులకు ఆయన క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో పాటు, విద్యలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకొని తాము ఎంచుకున్న క్రీడలో రాణించాలన్నారు. క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, అనిల్, సురేష్, భాను, మల్లేష్, వంశీ, రాహుల్, రాజ్‌కిరణ్, అశోక్, జంగయ్య, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు 48వ మహాజన సభ

తుర్కయంజాల్: ది తుర్కయంజాల రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ 48వ మహాజన సభ మంగళవారం కొహెడలోని సర్వే నంబర్ 507లోని సంఘం గోదాముల వద్ద సంఘం చైర్మన్, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వై.రాందాసు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బడ్జెట్ సమావేశం వాయిదా

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశానికి సోమవారం కౌన్సిల్ సభ్యులు డుమ్మా కొట్టారు. 24 మంది కౌన్సిలర్లకు గాను చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక కోఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు.

అభివృద్ధి పథంలో ఇబ్రహీంపట్నం

- నిధులను సద్వినియోగం చేసుకోండి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏసీడీపీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్డీఎస్, డీఎంఎస్ నిధులు ఆయా మండలాలకు అధిక మొత్తంలో కేటాయించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు డబుల్ రోడ్లుగా మారాయని, వేసవి వచ్చిందంటే మంచినీటి కోసం ప్రజలు అల్లాడేవారని మిషన్ భగీరథతో ఆ సమస్య తీరిందని, నియోజకవర్గంలో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉంటే 23కు పెంచామని, లెక్కలేనన్ని ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసి హై–లో వోల్టేజీ సమస్యలు తొలగించామన్నారు. మురుగు నీరు రోడ్లపై పారకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల కోసం మండలానికి రూ.7కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామానికి రూ.5లక్షల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఇచ్చిన నిధులతో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తిచేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఎమ్మెల్యే మంచిరెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మినీ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు.

డబ్బులిస్తేనే విద్యుత్ పనులు..

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమావేశం నుంచి వెళ్లిన అనంతరం సమావేశంలో జరిగిన విద్యుత్ శాఖ అంశంపై చర్చ వాడీవేడిగా జరిగింది. విద్యుత్ శాఖ సిబ్బంది లంచాలకు మరిగారని.. డబ్బులిస్తానే పనులు చేస్తున్నారని సర్పంచ్‌లు బల్వంత్‌రెడ్డి, బూడిద రాంరెడ్డి, ఎంపీటీసీలు నాగమణి, శ్రీశైలంతోపాటు పలువురు సభ్యులు మండిపడ్డారు. విద్యుత్ కార్యాలయానికి వెళ్తే దరఖాస్తు తీసుకునేందుకు కూడా అక్కడ మనుషులుండరన్నారు. అవినీతికి పాల్పడుతున్న లైన్‌మెన్ విక్రాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే విద్యుత్ కార్యాలయానికి తాళం పెడుతామని ఎంపీపీ హెచ్చరించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఏఈ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. రాయపోల్ గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో ఏఈ శ్రీనివాస్‌రావు విఫలమైనట్లు సర్పంచ్ బల్వంత్‌రెడ్డి ఆరోపించారు. ఇళ్లముందు కొత్త స్తంభాలు వేస్తుంటే ఇంటి యాజమానులు అభ్యంతరం చేస్తున్నారని...అందుకే రాయపోల్‌లో సమస్య పరిష్కారం కాలేదని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు.

టీచర్ల కొరత తీర్చాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సమస్యను తీర్చాలని ఎంపీటీసీ చెరుకూరి మంగ కోరారు. టీచర్లను నియమించకుంటే విద్యార్థులు ప్రైవేట్ బడిబాట పట్టే అవకాశం ఉందని సర్పంచ్ ఆండాలు అన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టి తొలిసారి మండల సమావేశానికి వచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్యను సభ్యులు సన్మానించారు.

ఆలయ భూములపై హక్కులు కల్పించండి



నిరసన తెలుపుతున్న కౌలు రైతులు

యాచారం: ఓంకారేశ్వరాలయ భూములను ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం, రూ.లక్షలాది అప్పులు చేసి సాగుకు యోగ్యంగా మార్చుకున్నాం.. కానీ నేడు ఆలయ భూములను టీఎస్‌ఐఐసీకి ఇచ్చి మా పొట్ట కొట్టొద్దని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓంకారేశ్వరాలయ భూములు సాగు చేసుకుంటున్న తాడిపర్తి రైతులను సోమవారం టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సామ నిరంజన్ కలిసారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మేము సాగు చేసుకుంటున్న ఆలయ భూములను టీఎస్‌ఐఐసీకి ఇచ్చి దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు మా పొట్టకొట్టొద్దని అన్నారు. ప్రాణాలైన అర్పిస్తాం కానీ భూములను మాత్రం వదలమని కౌలు రైతులు అన్నారు. ప్రభుత్వం తమపై దయచూపి పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు మద్దతుగా టీజేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న ఈజీఎస్ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రాష్ట్ర సర్కార్ మండల పరిషత్‌లకు ఒక్క పైసా నిధులు కేటాయించటంలేదని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో పలు వార్డుల్లో రూ.14 లక్షల నిధులతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, మొక్కల పెంపకం, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. సర్పంచ్ క్రిష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ, ఉప సర్పంచ్ మేకల యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, పంచాయతీ రాజ్ ఏఈ ఉస్మాన్, వార్డు సభ్యులు లక్ష్మయ్య, అంజమ్మ, పాండు, రేణుక, పంచాయతీ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకుంటే ఆందోళన చేపడతాం

యాచారం పీహెచ్‌సీ(సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయిన)లో వైద్యులు సమయపాలన పాటించడంలేదంటూ అందిన ఫిర్యాదుల మేరకు సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ సుకన్య ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యాధికారి సూరజ్ అప్పటికే వెళ్లిపోయారు. వైద్యులు కూడా లేరు. విషయాన్ని ఎంపీపీ.. జిల్లా ఉన్నతాధికారి వరదచారికి ఫోనులో ఫిర్యాదు చేశారు. సరైన స్పందన లేకపోవడంతో ఆమె ఆస్పత్రిలోనే బైఠాయించారు. వైద్యులు లేని విషయాన్ని ఎంపీపీ మంత్రి సబితారెడ్డికి కూడా ఫోనులో ఫిర్యాదు చేశారు. తీరుమారకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని ఎంపీపీ హెచ్చరించారు.

మాసబ్ చెరువులో డంప్‌ను తొలగించండి

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరిత



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో డంప్ చేసిన మట్టిని వెంటనే తొలగించాలని లేని పక్షంలో మాసబ్ చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత అన్నారు. సోమవారం చైర్‌పర్సన్ మట్లాడుతూ.. నిజాం కాలం నుంచి కాపాడుతూ వచ్చిన చెరువు ఉనికికే ప్రమాదం పొంచి ఉందన్నారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ ఆక్రమణదారులు నిబంధనలను ఉల్లంఘించి మట్టిని డంప్ చేశారని అయినప్పటికి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈనెల 29న జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మట్టిని తొలగించడానికి రూ.5 లక్షల బిల్లును పెడుతున్నామని, అధికారులు స్పందించి మట్టిని తీయడానికి ముందుకు రాకపోతే ఇక్కడే బైఠాయించి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కాకుమాను సునీల్, నారని కవిత, కంబాలపల్లి ధన్‌రాజ్, బాలరాజు, మేతరి అనురాధ దర్శన్, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: తండాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం కడ్తాల్ మండలం గానుగుమార్లతండా పంచాయతీ పరిధిలోని కానుగుబావితండాలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో కల్చరల్ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ హంశమోత్యానాయక్, ఉప సర్పంచ్ శారదతో కలిసి జెడ్పీటీసీ భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమాన్ని, తండాల అభివృద్ధిని పట్టించుకోలేదని వారు అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, సీఎం కేసీఆర్ నూతనంగా తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సర్పంచ్‌లు విజయలక్ష్మి, లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ ప్రియారమేశ్, మాజీ ఎంపీపీ సువాలి, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, వార్డు సభ్యులు శ్రీనునాయక్, లక్ష్మన్, బీమన్, బాబా, క్యానాయక్, ఫకీరా, రాజు, శ్రీను, సేవ్యా, పత్యా, ఇర్షాద్, లక్ష్మణ్, పాండునాయక్ తదితరులు ఉన్నారు.

తులేకలాన్‌లో ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొవాలని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ ఏఈ ఇంద్రాసేనారెడ్డి, గ్రామ సర్పంచ్ చిలుక యాదగిరి పేర్కొన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో రోటరీక్లబ్ సైనర్జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగమణి, ఉప సర్పంచ్ రాజీరెడ్డి రోటరీ క్లబ్ వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో సోమవారం 77 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమార్, సరిత పంతునాయక్, కౌన్సిలర్లు సోని, కమటం రాధమ్మ, సర్పంచ్‌లు సోన శ్రీనునాయక్, మంజుల, ఆమనగల్లు తహసీల్దార్ జ్యోతి, నాయకులు పత్యానాయక్, రామకృష్ణ, అప్పం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3న ఆత్మీయ సమ్మేళనం..

ఆమనగల్లు పట్టణంలో ఏప్రిల్ 3న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగలరని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. పట్టణంలో సోమవారం ఆమనగల్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం మున్సిపల్ కన్వీనర్ పత్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు రామకృష్ణ, అప్పం శ్రీను, నిరంజన్‌గౌడ్, సయ్యద్ ఖలీల్, శంకర్, వడ్డె వెంకటేశ్, రమేశ్, అల్లాజీ, ఆనంద్, శివకుమార్, శేఖర్, దేవేందర్, పెద్దయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన సభావట్ చిట్టి అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. సాయం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.26 వేల చెక్కు మంజూరయ్యింది. సోమవారం బాధిత కుటుంబానికి చెక్కును జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అందజేశారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేశ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు తిరుమలేశ్, మూడరవి, పాండునాయక్ ఉన్నారు.

బండరావిరాలకు చెందిన పెద్దులుకు..

అబ్దుల్లాపూర్‌మెట్: మండంలోని బండరావిరాల గ్రామానికి చెందిన కూర పెద్దులుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 60వేల చెక్కును సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్‌గౌడ్, దానేష్, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్, దయానంద్ పాల్గొన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం

బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్

తలకొండపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో సోమవారం శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్‌లో భాగంగా ప్రజలగోసా–బీజేపీ భరోసా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీరేందర్‌గౌడ్‌తో పాటు, బీజేపీ నేత తల్లోజు ఆచారి హాజరయ్యారు. వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని అన్నారు. ఆమనగల్లు నియోజకవర్గంలో ప్రజల కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్న ఆచారిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర, జిల్లా నాయకులు పాండు, కుమార్, ప్రసాద్ పవన్, మండలాధ్యక్షుడు రవిగౌడ్, రమేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

తుర్కయంజాల్: వివేకానంద ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల బృందం సోమవారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని 24వ వార్డులో ప్లాస్టిక్ వ్యర్థాల వల్లే కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, వ్యర్థాలను డ్రైనేజీలో వేయకూడదని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకుని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి.చిన్నబాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సోన శ్రీనునాయక్

ఆమనగల్లు: గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని రాంనుంతల గ్రామ సర్పంచ్ సోన శ్రీనునాయక్ కోరారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సోన శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో రాంనుంతల గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం మండల పరిషత్ నిధుల నుంచి రూ.2లక్షలు, గ్రామ పంచాయితీ నిధుల నుంచి రూ.2లక్షలతో మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సరిత పంతునాయక్, నాయకులు శ్రీనునాయక్, జీవితానాయక్, దేశ్య, సేవ్య, నిరంజన్, బన్సి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్యాంసుందర్

మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు: స్వచ్ఛ మున్సిపాలిటీకి ప్రజలు సహకరించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం వివిధ మహిళా సంఘాల గ్రూపు సభ్యులచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే ఆమనగల్లును స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఇంటిపక్కన, రోడ్లపై చెత్త వేయకుండా చెత్తను తడి, పొడిచెత్తగా వేరుచేసి మున్సిపాలిటీ చెత్త తరలించే సిబ్బందికి అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, వివిధ మహిళా సంఘాల గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్థిక క్రమశిక్షణకు చిరునామాగా మహిళా సంఘాలు గుర్తింపు పొందుతున్నాయని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 686 మహిళా సంఘాలకు రూ.39.79కోట్లు, 449 సంఘాలకు రూ.4కోట్ల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే వారి కుటుంబాలు బాగుపడతాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని పథకాలను మహిళల ద్వారానే అందజేస్తామని, డీఆర్‌డీఏ సెర్ప్ ద్వారా మహిళా సంఘాల అభివృద్ధి దేశానికే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, అడిషనల్ పీడీ జంగారెడ్డి, ఎంపీడీఓ మమతాబాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మహిళలు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించకుంటే చర్యలు

- వాయిదాల చెల్లింపునకు ఈనెల 30 తుది గడువు
- అప్పటికీ చెల్లించకుంటే ఆస్తుల జప్తు
- పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం: పీఏసీఎస్ బలోపేతానికి రైతులు సహకరించాలని చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. యాచారం పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాచారం పీఏసీఎస్‌లో 2,500 మంది రైతులకు పైగా రూ.29 కోట్ల దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. చెల్లింపు గడువు (మార్చి–30) ముగుస్తున్నా నేటికీ కేవలం రూ.6 కోట్లు మాత్రమే వసూలైనట్లు తెలిపారు. సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు రెండు రోజుల్లో అప్పు వాయిదాలు చెల్లించాలని కోరారు. అప్పు వాయిదాలు చెల్లించకపోతే డీసీసీబీ ప్రత్యేక టీం బకాయిదారుల ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉందని అన్నారు. దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు పౌల్ట్రీ, డెయిరీ, మేకలు, గొర్రెల పెంపకం చేపడుతూ ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్న సంఘానికి వాయిదాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. పాత పీఏసీఎస్ భవనాన్ని కూల్చేసి రూ.52లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మించే నూతన భవనంలో రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రైతులకు అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, సామగ్రిని అందుబాటులో ఉంచి విక్రయించడమే లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కొండ మధుకర్‌రెడ్డి, పాశ్య భాషా, లక్ష్మయ్య, స్వరూప, శశికళ, పీఏసీఎస్ సీఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.